క్లుప్తంగా

రేపు చేబ్రోలులో ఉచిత మెగా వైద్య శిబిరం

కొరిటిపాడు(గుంటూరు):చేబ్రోలులోని సూర్య దేవర నర్సయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం గుంటూరు రమేష్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.వి.నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు మండల ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సంఘం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతోందని పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని చేబ్రోలు, చుండూరు మండలాల్లోని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా అసదుల్లా



కాకుమాను వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా కొమ్మూరుకు చెందిన సీనియర్ నాయకుడు ముజావర్ షేక్ అసదుల్లాను అధిష్టానం నియమించినట్లు కాకుమాను జెడ్పీటీసీ షేక్ గుల్జార్ బేగం శుక్రవారం తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తగా ఉంటూ మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా అసదుల్లా స్పందిస్తూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ తీసుకువచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విజ్ఞాన్ వర్శిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన అధ్యాపకుడు ధూళిపాళ్ల విజయకృష్ణకు ఆంధ్రా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. 'ఏ స్టడీ ఆన్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని పేర్కొన్నారు. విజయకృష్ణను పలువురు అభినందించారు.

జొన్నలగడ్డలో ఉచిత గుండె వైద్య శిబిరం



గుంటూరు రూరల్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ డాక్టర్ జ్వాలసాయి పేర్కొన్నారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా తమ హాస్పిటల్‌లో గుండెకు సంబంధించిన పరీక్షలు, వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిబిరంలో ఈసీజీ, ఎకో, యాంజియోగ్రాం, బీపీ, షుగర్, ఆయాసం, గుండెనొప్పి తదితర పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నామా శ్రీనివాస్, వంగా నవీన్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూటికాడతో నీటి పారుదలకు ఆటంకం



తెనాలి టౌన్: రూరల్ మండలంలోని గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల మీదుగా వెళ్లే జీఆర్‌బీసీ మురుగు కాల్వలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క ఆకుల్ని వెంటనే తొలగించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అధికారుల్ని కోరారు. సకాలంలో తూటికాడ, గుర్రపు డెక్క ఆకులు తొలగించకపోవడం వల్ల మురుగునీరు పారుదల కావడం లేదని చెప్పారు. సమస్యల్ని డ్రైనేజీ డీఈఈ ఎం.అనిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు సురేష్, అశోక్, మోహనరావు ఉన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

కొల్లిపర: పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో కె.వెంకటరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన వరి పంట నమోదును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సాగు చేసిన పొలం వద్దకు వ్యవసాయ సిబ్బంది వెళ్లి పంట నమోదు చేయాలని చెప్పారు. పంట నమోదు వల్ల నష్టపరిహారం, పంటల బీమా వంటివి రైతులకు అందుతాయని తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మన్నవలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మన్నవ గ్రామంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య.

చేబ్రోలు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి వివరించారు. కరపత్రాలను అందజేశారు. స్థానికులు తెలియజేసిన సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల వద్దకే పరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.

దొప్పలపూడిలో తాగునీటి పైప్‌లైన్‌ను ప్రారంభం..

దొప్పలపూడి ఎస్టీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. గ్రామ సర్పంచులు బోనిగల నాగమల్లేశ్వరరావు, కర్రి రమేష్, నాయకులు అన్నవరపు వినోద్, పీటర్, నాగరాజు, భవనం వంశీరెడ్డి, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ సైపుల్లా, షేక్ మాము, పెరికల కృష్ణమోహన్, దాసరి నారాయణ రావు, బి.రంగారావు, రుద్రపాటి ఆదిశేషు, దేవర కొండ గోపి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు



నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

చేబ్రోలు: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలతో మండలంలోని పలు దేవాలయాలు కళకళలాడాయి. నాగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తరెడ్డిపాలెం ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వేజండ్ల, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల్లో వరలక్ష్మి పూజలు జరిగాయి.



పెదకాకాని వై జంక్షన్‌లోని ఆయలంలో వరలక్ష్మి అమ్మవారికి హారతి..

వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదకాకాని: వరలక్ష్మి వ్రత పూజలతో ఆలయాలు శుక్రవారం కళకళలాడాయి. శ్రావణ శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకాకాని వరలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజ్ఞాన కేంద్రంతో ఎన్నో ఉపయోగాలు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



విజ్ఞాన కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న రాఘవులు

పెదనందిపాడు : విజ్ఞాన కేంద్రం వల్ల అందరికి చాలా ఉపయోగాలు ఉన్నాయని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. శుక్రవారం పెదనందిపాడులో పార్టీ సీనియర్ నాయకుడు తెళ్ళ నారాయణ పేరుమీద నూతనంగా నిర్మించిన విజ్ఞాన కేంద్రాన్ని అయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో రాఘవులు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం స్థానికంగా అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కేంద్రం నిర్మాణానికి అన్ని పార్టీల నాయకులు సహకరించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, సేవా కార్యక్రమాలపై అధ్యయనం చేసి, ప్రణాళికలు రూపొందించనున్నట్లు అయన తెలిపారు. ఉత్పత్తికి అవసరమైన నైపుణ్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, నర్రా బాలకృష్ణ, నిర్మాణ కమిటీ సభ్యులు దొప్పలపూడి రమేష్, కాకుమాను నాగేశ్వరావు, రేనాకన హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే తక్షణ కర్తవ్యం

- నయా ఫాసిస్టు బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఒకటిగా పోరాడాలి
- సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: బీజేపీని ఓడించడమే వామపక్ష, విప్లవ, లౌకిక, బహుజన, ప్రజాశక్తుల తక్షణ కర్తవ్యమని సీపీఐ(ఎం.ఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ తీర్మానించింది. నాలుగు రోజులుగా లింగాయపాలెం గ్రామంలోని కామ్రేడ్ కల్లా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ అధ్యక్షత సమావేశాలను నిర్వహించారు. శుక్రవారం సమావేశంలో అమరులైన ప్రజా గాయకుడు గద్దర్, సియాసిత్ ఉర్దూ పత్రిక సంపాదకుడు జహీర్ అలీఖాన్, పార్టీ సభ్యురాలు కొల్లిపర ఈశ్వరి తదితరులకు జోహార్లు అర్పించారు. నాలుగు రోజుల సమావేశాల్లో పలు తీర్మానాలు చేశారు. బహుళ జాతుల సంస్కృతి, భాషలు కలిగిన భారతదేశంలో ఒకే భాష, ఒకే ప్రజా ఒకే చట్టం పేరుతో భారతీయ జనతా పార్టీ విధ్వంసాన్ని సృష్టిస్తోందన్నారు. హిందూ ఉన్మాద చర్యలు హర్యానా రాష్ట్రాలకు విస్తరించిన విషయాలను కూడా సమావేశంలో చర్చించారు. యూనియన్ సివిల్ కోడ్ తీసుకురావడం ద్వారా ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మైనార్టీలు, దళిత, బహుజనుల ప్రజలపై దోపిడీ, అణిచివేతలు తీసుకురావడంలో భాగమేనన్నారు. ఈ సమావేశంలో కామ్రేడ్స్ శంకర్ (పశ్చిమ బెంగాల్), కొల్లిపర వెంకటేశ్వరరావు, షేక్ మహమ్మద్ బాషా, కబీర్ కట్లిట్, ఎం.కె దాసన్, ప్రావింత్, స్మిత (కేరళ) ఇనియన్ యశ్వంత్, నటరాజన్(తమిళనాడు), ప్రమీల, హీనా భారిక్, శంకర్, (ఒరిస్సా) బిందు మిశ్రా, అక్షయ్ కుమార్(మహారాష్ట్ర), సౌరవ్(చత్తీస్గఢ్), తుహిన్ దేబ్(ఉత్తరప్రదేశ్), విజయ్. ఉర్మిళ (మధ్యప్రదేశ్), ఆర్.మానసయ్య, రుద్రయ్య, అమీర్ అలీ, పూర్ణిమ (కర్ణాటక) వివేక్ వాసు(జార్ఖండ్), లాబ్ సింగ్ (పంజాబ్), మొలుగూరి సైదయ్య(తెలంగాణ), ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మొదలగు రాష్ట్రాల నుంచి సమావేశాలకు సభ్యులు హాజరయ్యారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్య భరోసా




వల్లభాపురంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వల్లభాపురం(కొల్లిపర): ఫ్యామిలీ డాక్టర్ సేవలతో పల్లె ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని మండల వైద్యాధికారిణి చిక్కాల లక్ష్మీసుధ పేర్కొన్నారు. మండలంలోని వల్లభాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పేదలకు వైద్యసేవలు అందించారు. గ్రామంలో దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ బొమ్ము కోటిరెడ్డి, ఎంఎల్‌హెచ్ పి.సరళ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి కూరపాటి శ్యామ్ జ్యోతి, ఆశా కార్యకర్త కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు విధుల్లో చేరడంతో వారికి వార్డులు కేటాయించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలు, డీఈఈలకు వార్డుల వారీగా వర్క్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్లకు కేటాయించిన ఇంజినీరింగ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైన ఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటస్వామి వివరాల మేరకు.. తారక రామ నగర్ 3వ లైనుకు చెందిన మన్నవ సూర్యనారాయణ(75) అనే వృద్ధుడు ఈ నెల 24 నుంచి కనబడటంలేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిస్తే.. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లోగానీ 8688831376, 8688831607 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన



తెనాలి టౌన్: పట్టణ శివాజీ చౌక్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో కొత్త ఓటర్లను చేర్చడం, రెండు చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించడం, అక్రమంగా ఓట్లు లేకుండా చూసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.అనంతాచార్యులు, అన్నవరపు వేణు, మైలా హరికృష్ణ, బొల్లిముంత విజయ కుమార్, బోడపాటి వినయ్‌కుమార్, ఆదిత్య, శిఖా రవీంద్ర, కుశల్‌రాజ్ జైన్ పాల్గొన్నారు.

28న కొల్లూరు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

కొల్లూరు : ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కొల్లూరు బీఆర్కే శాస్త్రి ఐటీఐ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ గుమ్మడి శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక రైల్వే పరికరాలు, వందే భారత్ రైళ్ల తయారీ సంస్థ మేధా సర్వో డ్రైవ్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐలో ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సులలో 2018 అనంతరం ఉత్తీర్ణులైన యువత జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. సోమవారం ఉదయం 9 నుంచి ప్రారంభమవనున్న జాబ్ మేళాకు అర్హతలున్న అభ్యర్థులు ఏ ప్రాంతానికి చెందిన వారైనా.. హాజరు కావొచ్చని వెల్లడించారు. బయోడేటా, 10వ తరగతి, ఐటీఐ మార్క్స్ లిస్టు, ఎన్‌టీసీ నకళ్లతో పాటు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలకు 92985 02350 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

బంగారు గొలుసు లాక్కొని ఆగంతుకులు పరారీ

గుంటూరు ఈస్ట్: వ్యక్తి మెడలోని బంగారు గొలుసు ఆగంతుకులు లాక్కొని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన పి.వెంకట శ్రీనివాసరావు శుక్రవారం తెల్లవారుజామున నడుచుకుంటూ బృందావన్ గార్డెన్స్ 7వ లైనులోకి వెళుతున్నారు. ఈ సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి శ్రీనివాసరావు మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర మెసేజ్ పంపుతున్న వ్యక్తిపై ...

మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లికార్జునపేటకు చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి తన సెల్ నంబరు నుంచి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాప్రతినిధుల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజాప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం తన చాంబర్‌లో కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరినందున శుక్రవారం కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించారు.

హక్కుల పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగ సంఘాల నాయకులతో కలసి రాజ్యాంగ పరిరక్షణకు సెప్టెంబర్ 9న విజయవాడలో నిర్వహించనున్న సదస్సు సన్నాహాక సమావేశం నిర్వహించారు. ముందుగా సదస్సుకు సంబంధించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం లైజినింగ్ ఆఫీసర్‌ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి వారికి రిజర్వేషన్ ఫలాలు అందించాలని విన్నవించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చార్వాక, కనపర్తి సంగీతరావు, మురికిపూడి దేవపాల్, కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, కోడిరెక్క కోటిరత్నం, నల్లపు నీలాంబరం, నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్

లక్ష్మీపురం: మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని సెప్టెంబర్ 1నుంచి ప్రారంభిస్తున్నామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయుబ్ హుస్సేన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని చౌత్ర సెంటర్, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కృష్ణానగర్‌లో గల ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రాల్ని, ఉర్దూ అకాడమీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేది నుంచి ప్రారంభం కానున్న కంప్యూటర్ శిక్షణ తరగతుల్ని నిరుద్యోగ యువకులు, విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాల్ని సమకూర్చాలని నిర్వాహకులకు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఉర్దూ అకాడమీ సంయుక్తంగా మొదటిసారి నిర్వహిస్తున్న తరగతులతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల రూపకల్పన జరుగుతున్నట్లు వివరించారు. మైనారిటీ నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్థిక పురోగతి సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ భాషాభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ అహ్మద్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, శిక్షణా కేంద్రం పర్యవేక్షకులు షేక్ మహిమున్నీసా, కరిముద్దీన్, ఉర్దూ లైబ్రరీ ఇన్‌చార్జ్ నయీం అహ్మద్, జాన్‌సైదా, ముస్తాఫా, షేక్ నాగుర్‌బాషా పాల్గొన్నారు.

గంగానమ్మ కొలుపులు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్‌పేట రజకుల కాలనీలోని గంగానమ్మ తల్లి కొలుపులు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.అర్చకుడు కమలాకరశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్ని ఉత్సవ నిర్వాహకులు వై.వి. సాయి రాఘవ, రజక కాలనీ అధ్యక్షుడు వై. కృష్ణ పర్యవేక్షించారు. శనివారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి పొంగళ్లు, సాయంత్రం 5 గంటలకు పల్లకీ ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కృష్ణ కోరారు.

ట్రాక్టర్లపై కేసులు నమోదు


సాక్షి ఎఫెక్ట్



జరిమానా విధించిన ట్రాక్టర్‌తో ఆర్టీవో అధికారులు

పట్నంబజారు : 'సాక్షి' లో శుక్రవారం ప్రచురితమైన వేశా పాశా లేదు.. ప్రాణాలంటే లెక్కలేదు కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వాహనాలపై కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్లు మూడు, డ్రైవింగ్ లైసెన్సు లేనివి ఎనిమిది, పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి రెండు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఒకటి, పన్ను చెల్లించకుండా తిరుగుతున్నవి ఒకటి, ఇన్సూరెన్సు లేకుండా మూడు వాహనాలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రాక్టర్లు, రిఫ్లెక్టర్ లేకుండా తిరుగుతున్న రెండు వాహనాలు కలిపి మొత్తం 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీమ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు రోడ్డుపై తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని తెలిపారు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సు కలిగి ఉన్న వారు మాత్రమే రోడ్డుపైకి రావాలని స్పష్టం చేశారు.రోజూ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తేజేశ్వర్‌కు అభినందనలు



గుంటూరు వెస్ట్: పోలాండ్‌లో ఈ నెల 10 నుంచి 20 వరకు జరిగిన ఇంటర్నేషనల్ ఒలింపియన్ (ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్) ఫైనల్స్‌లో నెగ్గి బంగారు పతకం సాధించిన కోడూరి తేజేశ్వర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాలరెడ్డి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని కొనియాడారు. మన యువత దేశ విదేశాల్లో ప్రతిభకనబరచడం దేశానికే గర్వకారణమన్నారు. నిత్యం నేర్చుకునే విధంగా ఉండాలని చెప్పారు. విజయవాడకు చెందిన ఫిట్టి విద్యాసంస్థ పిన్నెపు రమేష్‌బాబు సంస్థ తరఫున తేజేశ్వర్‌కు రూ.10 లక్షల రివార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.